క్లుప్తంగా

డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ



మతీన్‌ను అభినందిస్తున్న డిగ్రీ కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎస్‌కే అబ్దుల్ మతీన్ వ్యాసరచన పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచాడు. సమాచార హక్కు చట్టం 2005ను పురస్కరించుకొని తాడేపల్లిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్‌ఆర్‌సీ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి సాధించి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గుత్తా గిరిబాబు విద్యార్థిని అభినందిస్తూ జోనల్ స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

ఉచిత బస్సుపై అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణానికి సంబంధించి ఆర్టీసీ సిబ్బందికి ఏలూరు జిల్లా ప్రజా రవాణాధికారి షేక్ షబ్నం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉచిత ప్రయాణమైనప్పటికీ మహిళలకు జీరో టిక్కెట్టు ఇవ్వాలని సూచించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీ సత్యనారాయణకు వినతి పత్రం అందిస్తున్న నాయకుడు

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏలూరు జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం కోరారు. ఈమేరకు ఆయన శనివారం రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణకు తమ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఏలూరు జిల్లాలో ఉన్న దివ్యాంగులకు వీల్ చైర్లు, బ్యాటరీ బళ్లు, చంక కర్రలు, చెవిటి మిషన్లు, మోటార్ సైకిళ్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, నడపన దానభాస్కర్, వికలాంగుల సంఘం, జిల్లా కోశాధికారి నక్కా రాము, కొమ్ము జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.



ఎండలో వృద్ధుడి ఆపసోపాలు



మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన కొత్తబస్టాండ్ రోడ్డు

ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

సాధారణంగా ఆగస్టు నెలలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుంటాయి. కాని ప్రస్తుతం తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలు దాటకముందే రోడ్లపై జన సంచారం ఉండడంలేదు. దీనికి తోడు విద్యుత్ కోతలతో ప్రజలు విలవిలాడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన ప్రజలు గొడుగు, స్కార్ఫ్‌లు, టవల్స్ ఉపయోగించుకుని తిరుగుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



ఫుట్‌పాత్‌పై ఎండలో చిరువ్యాపారుల అవస్థలు



బండి ఉన్నా, గొడుగు ఉండాల్సిందే



ఎండ వేడిమి తట్టుకోవాలంటే స్కార్ఫ్ తప్పనిసరి

టెకు బ్యాంక్ సేవలు విస్తృతం



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ అంబికా ప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డిజిటల్ బ్యాంకింగ్ ఫీచర్లను మెరుగుపరచడం ద్వారా టెకు బ్యాంక్ సేవలు విస్తృతంగా అందిస్తున్నామని ఆ బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్ తెలిపారు. ది ఏలూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ (టెకు) బ్యాంకు 112వ వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా ఏలూరులోని బ్యాంకు ఆవరణలో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కస్టమర్ల బ్యాంకింగ్ అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చడానికి త్వరలో తణుకు, గుంటూరు, అనకాపల్లిలో బ్యాంక్ బ్రాంచ్‌లు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సేవల విస్తృతికి ఈ ఏడాది డిసెంబర్ నాటికి విశాఖపట్నం, బాపట్ల, పల్నాడు జిల్లాలో టెకు బ్యాంకు సేవలు విస్తరించనున్నట్లు ప్రకటించారు. బ్యాంకు సీఈఓ ఎం అచ్యుతరావు, ఉపాధ్యక్షులు ఎస్ రామారావు, బీవీ గంగా సరళ, సీహెచ్ ఆంజనేయ స్వామి, ఎస్‌కే షాబీర్ హుస్సేన్, బ్రాంచ్ మేనేజర్ కె.చక్రధర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవతా కళా ప్రపూర్ణుడు రాఘవ

ఏలూరు(మెట్రో): మానవతా కళాప్రపూర్ణుడు బళ్లారి రాఘవ అని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. ఏలూరు కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో శనివారం బళ్లారి రాఘవ జయంతి కార్యక్రమం నిర్వహించారు. రాఘవ చిత్ర పటానికి డీఆర్వో వి.విశ్వేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. రాఘవ నాటక రంగంలో సంచలనాలు సృష్టించి సినిమా రంగం వైపు వెళ్లిన గొప్పనటుడన్నారు. తొలితరం కథానాయకుల్లో రాఘవ ఒకరని తెలిపారు. కళా రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 1981లో తపాలా బిళ్లను విడుదల చేశారని, మొట్ట మొదటిసారిగా తెలుగు సినీ పరిశ్రమకు బళ్లారి నుంచి బళ్లారి రాఘవకు ఈ గౌరవం దక్కిందని తెలిపారు. విశాల ఆలోచనాలు అనంత భావాలు జాతి ప్రగతికి, మూఢాచారాల నిర్మూలనకు నాటకరంగం ప్రధాన సాధనమని



రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భావించి నాటకరంగం అభివృద్ధికి రాఘవ ఎనలేని కృషిచేశారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సెట్వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకరరావు, జిల్లా టూరిజం మేనేజరు ఎస్ పట్టాభి రామన్న, కలెక్టరేట్‌లోని పలు విభాగాల సూపరింటెండెంట్‌లు ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ నన్స్‌కు బెయిల్‌పై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న వరప్రసాదరావు తదితరులు

ఏలూరు (టూటౌన్): ఛత్తీస్‌ఘడ్‌లో అరెస్ట్ చేసిన క్రిస్టియన్ నన్స్‌కు బెయిల్ రావటం ఆనందదాయకమని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు తెలిపారు. స్థానిక కోర్టు సెంటర్‌లోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. అకారణంగా క్రిస్టియన్ నన్స్‌ను 10 రోజులుగా ఛత్తీస్‌ఘడ్ జైల్లో పెట్టడం దుర్మార్గమన్నారు. క్రిస్టియన్స్‌కు రక్షణ కల్పించాలని, వారి ఆస్తులు కాపాడాలని, మత బోధకులపై దాడులను అరికట్టాలని, దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని ప్రధాని మోదీని కోరారు. సమావేశంలో దళిత జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం: పింఛన్ల విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను మార్చుకోవాలని వైఎస్సార్ సీపీ జంగారెడ్డిగూడెం మీడియా కో ఆర్డినేటర్ చిప్పాడ వెంకన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త పెన్షన్‌లు అమలులో జాప్యం తగదని పేర్కొన్నారు. 60 ఏళ్లు పైబడి పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి చనిపోతే వారి స్థానంలో భార్యకు పెన్షన్ ఇచ్చే కొత్త ప్రక్రియ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. నూతన పెన్షన్‌లు మాత్రం ఇవ్వడం లేదని, కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్ల హామీని విస్మరించిందని పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా 5న ధర్నా

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వం బిగిస్తున్న అధాని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు పి.కిషోర్‌లు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక స్ఫూర్తి భవనంలో ఏఐటీయూసీ అనుబంధ, ఏలూరు పట్టణ పొగాకు పనివారల సంఘం విస్తృత సమావేశం సంఘ అధ్యక్షుడు బరగడ పోతురాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల ఇకపై పగటి పూట కంటే రాత్రిపూట వాడే విద్యుత్‌కు ఎక్కువ చార్జి వసూలు చేస్తారని తెలిపారు. సెల్ ఫోన్ రీచార్జి చేసుకున్నట్టు ముందుగానే విద్యుత్‌కు రీచార్జి చేయించుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఖర్చు కూడా ఒక్కొక్క మీటరుకు రూ.9 వేలు నుంచి రూ.17 వేలు నెలవారి బిల్లులు ప్రజల నుండే వసూలు చేస్తారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని నారా లోకేష్,



మాట్లాడుతున్న శ్రీనివాస డాంగే

కూటమి నేతలు చెప్పిన మాటను ఇప్పుడు తప్పుతున్నారని విమర్శించారు. యూనియన్ కార్యదర్శి పుప్పాల శ్రీనివాసరావు కార్యకలాపాలు రిపోర్టును, జమా ఖర్చుల నివేదికను కోశాధికారి చింతపల్లి కూర్మారావు ప్రవేశపెట్టగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఆర్యవరపు వెంకటేశ్వరరావు (చిన్ని), పసుపులేటి దుర్గారావు, ఉప్పు గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మరో రూ.12,771 కోట్ల విద్యుత్ భారం ఆపాలి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ చార్జీలు పెంచబోమని, పైగా ట్రూడౌన్ పేరుతో ధరలు తగ్గిస్తామని ప్రకటించి నెల రోజులు కూడా కాకుండానే మరలా ట్రూఅప్ పేరుతో మరో రూ.12,771 కోట్లు భారాన్ని మోపడాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. 2019–20 నుంచి 2023–24 సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ రిటైల్ వ్యాపార లోటు పేరుతో రూ.12,771 కోట్లు ట్రూ అప్ భారం వేయడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ నియంత్రణా మండలికి ప్రతిపాదనలు పంపి బహిరంగ ప్రకటన చేశాయని పేర్కొంది. గత 36 నెలల నుంచి 2014–19 కాలానికి సంబంధించిన రూ.3 వేల కోట్లు ట్రూ అప్ చార్జీలు వసూలు చేశారని తెలిపింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 2022–23, 2023–24 సంవత్సరాల కాలానికి రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీల భారం మోపారని పేర్కొంది. ఇదీకాక 2024–25 సంవత్సరానికి ప్రతినెలా యూనిట్‌కు 40 పైసలు చొప్పున ఒక్క సంవత్సరంలోనే రూ.2787 కోట్లు వసూలు చేశారని, స్మార్ట్ మీటర్లు వల్ల అదనపు భారాలు సిద్ధంగా ఉన్నాయని వివరించింది. విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా, ట్రూ అప్ / ఇంధన సర్దుబాటు చార్జీల విధానం రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు వద్దని ఆగష్టు 5న ప్రజావేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పింగళికి భారతరత్న ప్రకటించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారత జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించాలని జాతీయ జెండా ప్రచారకర్త, ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపక కార్యదర్శి ఎస్‌ఎం సుభాని డిమాండ్ చేశారు. పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం నగరానికి చెందిన ఘంటసాల స్వరపీఠం, మానవత, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, బహుజన ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక సీనియర్ సిటిజన్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ ఇతర దేశాల్లో జెండా రూపశిల్పులకు ప్రత్యేక గౌరవాలు దక్కినా, మన దేశంలో పింగళికి తగిన గౌరవం దక్కలేదని అన్నారు. ఘంటసాల స్వరపీఠం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించాలని, పింగళి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి రాబోయే తరాలకు ఆయన గొప్పతనాన్ని వివరించాలని కోరారు. ఏలూరులో పింగళి విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల ప్రతినిధులకు సుభానీ స్వయంగా రూపొందించిన జాతీయ జెండాలను పంపిణీ చేశారు. సామాజికవేత్త పోలవరపు దేవ రత్నాకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు వై.అర్జునరావు, లంకా వెంకటేశ్వర్లు, దేవరకొండ వెంకటేశ్వర్లు, సీహెచ్ విక్రమ్ కిషోర్, ప్రసాదరావు, దేవినేని భాస్కరరావు, కావూరి జిన్నా, ఎంఎస్ కుమార్, కొమ్మోజు శ్రీనివాస్, కడుపు కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జండాను పంపిణీ చేస్తున్న ఘంటసాల స్వరపీఠం ప్రతినిధులు

ఉచిత అన్నప్రసాదం నాణ్యత, రుచిపై ఆరా

ద్వారకాతిరుమల: భక్తులకు అందిస్తున్న లడ్డూ, పులిహోర, శర్కర పొంగలి, వడ ప్రసాదాల తయారీని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి శనివారం తనిఖీ చేశారు. అంబరుఖానాకు వెళ్లిన ఆయన ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ వాసా నగేష్, సీనియర్ అసిస్టెంట్ వాసులతో కలిసి ప్రసాదాల తయారీ, నాణ్యతను పరిశీలించారు. అనంతరం నిత్యాన్నదాన భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడారు. ప్రసాదం నాణ్యత, రుచిపై ఆరా తీశారు. భక్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఈఓ ఆలయ పరిసరాల్లోని పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు.



ప్రసాదాల తయారీని పరిశీలిస్తున్న ఈఓ మూర్తి

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	24	బీన్సచిక్కుడు	120
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	64	కంద	00
కాకర కాయలు	40	బీట్‌రూట్	40
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	26	అల్లం	88
క్యారెట్	40–45	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	46	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	30	పుదీనా	05
ఆనబకాయ (1)	20–30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	14
ఏలూరు – జేడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	17
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	01
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	08
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	11
ఏలూరు –జేడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	21
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

అడుగడుగునా గుంతలే!



దెందులూరు: ఏలూరు ఆశ్రం హాస్పిటల్ నుంచి ఏలూరు రైల్వే స్టేషన్ వరకు అడుగడుగునా గుంతల కారణంగా రాకపోకలకు ప్రయాణికులు నానా హైరానా పడుతున్నారు. ఈ మార్గంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్నా, రోడ్డు అభివృద్ధిని పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడటంతో గుంతల్లో నీరు చేరి ఇబ్బందులు పడుతున్నామని, కనీసం గుంతలైనా పూడ్చించాలని వారు కోరుతున్నారు.



ఆశ్రం నుంచి రైల్వేస్టేషన్ మధ్య రోడ్డు గుంతలు

మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయం

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల ప్లస్‌లో గతేడాది ఎంపీసీ గ్రూపులో ద్వితీయ సంవత్సరం 775 మార్కులు సాధించిన మెరిట్ స్టూడెంట్ సౌమ్యకు డిగ్రీ చదువు నిమిత్తం ఉపాధ్యాయులు శనివారం ఆర్థిక సాయం చేశారు. పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తున్న పురిటిపాటి పల్లారెడ్డి రూ. 5 వేలు, సైన్స్ టీచర్‌గా పని చేస్తున్న సీఎం భాస్కర్ రూ. 2 వేలు అందించారు. పాఠశాల హెచ్‌ఎం వడ్లపట్ల విజయకుమార్ చేతుల మీదుగా విద్యార్థినికి సాయం అందించారు.

మోసం చేయడం బాబు నైజం

మాజీ ఎమ్మెల్యే బాలరాజు

వేలేరుపాడు: ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆరోపించారు. శనివారం వేలేరుపాడు మండలం భూదేవిపేట, చాగరపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబానికి ఏ మేరకు నష్టం జరిగిందో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి చూపించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో ఇచ్చిన నవరత్నాల పథకాలతోపాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తే, కూటమి ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి దోచుకోవడం, దాచుకోవడంలో పోటీ పడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఏటా రైతు భరోసా పేరుతో రైతుకు రూ.13500 అందిస్తే, కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవగా మార్చినప్పటికీ నేటికీ అమలు చేయడంలేదని వివరించారు. రైతులకు విత్తనాలు, యూరియా కూడా సక్రమంగా పంపిణీ చేయడంలేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే, డాక్టర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన బెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని దుయ్యబట్టారు. రాజకీయ కక్షతో వైస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై దాడులు చేయడం, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధించడం తప్ప, ప్రజలకు చేసింది శూన్యమని అన్నారు. హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.



భూదేవిపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు